

ఊపందుకున్న వరి నాట్లు



గుదలంవీధిలో వరినాట్లు వేస్తున్న గిరిజనులు -వార్త 8వ పేజీలో..



బాకూరు ఆశ్రమ పాఠశాల సిబ్బంది ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యశాఖ డైరెక్టర్ రామనాథ్

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర వైద్య శాఖ డైరెక్టర్ రామనాథ్
- బాకూరు ఆశ్రమ పాఠశాల సందర్శన
- ప్రతినెలా పరీక్షలు చేయాలని
- వైద్య సిబ్బందికి ఆదేశం

హుకుంపేట జూలై 4: గిరిజన ప్రాంతంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆరోగ్య శాఖ రాష్ట్ర డైరెక్టర్ రామనాథ్ ఆదేశించారు. గురువారం మండలంలోని బాకూరు ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. తొలుత విద్యార్థులతో విద్య, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌ఎం గదిలో ప్రతి నెలా విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలుంటే ముందుగానే ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు సక్రమంగా ఇవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, అతిసార, రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా కూడా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా శాఖ అధికారి ఎస్.ప్రసాద్, ఏఎంవోడీ శేషాద్రి, సిబ్బంది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అల్లూరి

- ఆయన పేరుతో ఏర్పాటైన జిల్లాలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నా..
- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్
- కలెక్టరేట్‌లో ఘనంగా విప్లవ వీరుడి 127వ జయంతి వేడుకలు



కృష్ణాదేవిపేట పార్కులో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తదితరులు



పాడేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో డీఆర్‌వో బి.పద్మావతి అధ్యక్షతన గురువారం నిర్వహించిన అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆంగ్లేయులపై సీతారామరాజు సాగించిన పోరాటం, ఆయన కీర్తి ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూ ఉంటుందన్నారు. ఆయన పేరిట ఏర్పాటు చేసిన జిల్లాలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గిరిజన ప్రాంతాలు కొంతమేరకు అభివృద్ధికి నోచుకున్నాయని, ఇంకా అనేక సమస్యలు, లోటుపాట్లున్నాయని, వాటిని గుర్తించి దశలవారీగా పరిష్కరించుకోవాలన్నారు. గిరిజన విద్యాలయాల్లోని విద్యార్థులకు బిడియం ఎక్కువగా ఉందని, దానిని పోగొట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన విద్యార్థులకు సానపెడితే చక్కని ప్రతిభ కనబరుస్తారని, యోగాపై బెంగళూరులో 40 రోజులు శిక్షణ ఇచ్చి పోటీల్లో నిలిపితే రెండో స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి అవసరమైన తర్ఫీదు ఇస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏదైనా సాధిస్తారని, అందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గిరిజన విద్యావ్యవస్థలో కొత్త వ్యూహాలను అమలు చేసేందుకు కృషి చేస్తామని, చక్కని ఫలితాలు రాబెడతామన్నారు. రహదారుల విషయానికి వస్తే పాడేరు ఐటీడీఏ పరిధిలో రోడ్లు లేని 978 గ్రామాలు, రంపచోడవరం ఐటీడీఏలో 250 గ్రామాలున్నాయని, వాటికి రోడ్లు నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన అల్లూరి జయంతి వేడుకలకు పార్టీలకతీతంగా అందరూ హాజరుకావడం శుభపరిణామమని, ఇదే స్ఫూర్తితో అందరం జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని కలెక్టర్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, అరకులోయ ఎంపీ డాక్టర్ జి.తనుజారాణి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అల్లూరి సీతారామరాజును ఉద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలోని అల్లూరి విగ్రహానికి కలెక్టర్, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఎంపీపీలు, వైస్.ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, చిత్రంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

నామినేటెడ్ పోస్టులకు జోరుగా పైరవీలు!

- కూటమికి పనిచేయని నేతలు సైతం ప్రయత్నాలు
- మన్యంలో చర్చనీయాంశంగా మారిన టీడీపీ నేతల ద్వంద్వ వ్యవహారం

(ఆంధ్రజ్యోతి-పాడేరు) మన్యంలోని పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు చెందిన తెలుగు దేశం పార్టీకి చెందిన పలువురు నేతలు నామినేటెడ్ పోస్టులను దక్కించుకునేందుకు జోరుగా పైరవీలు సాగిస్తున్నారు. వాస్తవానికి ఏజెన్సీలో పోటీ చేసిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేయించని నేతలే నామినేటెడ్ పోస్టుల కోసం అమరావతిలో టీడీపీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఏజెన్సీలో ఏ నలుగురి కలిసినా ఇదే విషయంపై మాట్లాడుకుంటున్నారు.

ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు దూరంగా..

సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు, అరకులోయ ఎమ్మెల్యే స్థానాల్లో పోటీ చేసిన కూటమి అభ్యర్థులతో కలిసి పనిచేయకుండా, కనీసం వారికి ఓట్లేయమని పక్కవారికి సైతం చెప్పని వ్యక్తులు నేడు నామినేటెడ్ పోస్టులు కావాలని టీడీపీ అధిష్ఠానం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి పోటీ చేయగా.. కేవలం టీడీపీ కార్యకర్తలు, అభిమానుల కృషి కారణంగానే ఆమెకు 47,468 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గ, మండల స్థాయి నేతలు ఆశించిన స్థాయిలో పని చేయకపోవడం వల్లే ఆమెపై 19,865 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరావు విజయం సాధించారు. ఇదిలా ఉండగా.. అరకులోయ అసెంబ్లీ స్థానంలో కూటమి అభ్యర్థిగా (బీజేపీ) పాంగి రాజారావు బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో బీజేపీకి ఆశించిన స్థాయిలో పట్టు లేకపోగా, పట్టున్న టీడీపీ నేతలు ఆయనకు మద్దతుగా నిలవకపోవడం వల్లే కేవలం 32,933 ఓట్లు వచ్చాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. టీడీపీ నేతల వైఖరి కారణంగానే వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగంకు 64,983 ఓట్లు వచ్చాయని స్థానికులు అంటున్నారు. దీంతో ఆయనకు 32,050 ఓట్ల మెజారిటీ వచ్చింది. కూటమి నేతలు ఒక మోస్తరుగా కృషి చేసినా వైసీపీ అభ్యర్థికి భారీ మెజారిటీ వచ్చేది కాదని కూటమి క్యాడర్ భావిస్తున్నది. ఏజెన్సీలో పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కనీసం కృషి చేయని, కష్టపడని నేతలు నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తాము టీడీపీ నేతలం, మాకు నామినేటెడ్ పదవులు ఇవ్వండని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. పైగా పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలతో పాటు అరకులోయ ఎంపీ సైతం వైసీపీకి చెందిన వారే ఉన్నందున టీడీపీ నుంచి నామినేటెడ్ పదవులు ఇస్తేనే గిరిజన ప్రాంతంలో పార్టీ, ప్రభుత్వం పట్టు నిలబడుతుందని కొత్త భాష్యం చెబుతున్నారు. దీంతో టీడీపీ శ్రేణులు, అభిమానులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మసాక్షి విడిచి పదవుల కోసం పాకులాడుతుండడం ఏంటని సదరు నేతలను కూటమి శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

2023-2024 నీటి సంవత్సరాంతానికి ఏపీ 0.4028 టీఎంసీలు అధిక వినియోగం

- ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌ల్లో నీటి నిల్వలు 13.8426 టీఎంసీలు
- ఇందులో ఏపీకి 6.5185 టీఎంసీలు, ఒడిశాకు 7.3241 టీఎంసీలుగా పంపకాలు



బలిమెల జలాశయం నీటి వినియోగంపై సమావేశమైన ఇరు రాష్ట్రాల అధికారులు

సీలేరు, జూలై 4: ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలోని నీటి వినియోగంపై ఆంధ్రా, ఒడిశా అధికారులు గురువారం మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఓహెచ్‌పీసీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. బలిమెల జలాశయం నుంచి 2023-2024 నీటి సంవత్సరంలో ఏ రాష్ట్రం ఎంతెంత నీటిని వినియోగించుకున్నారో లెక్కలను తేల్చారు. దీని ప్రకారం గత జూన్ నెలలో ఒడిశా 7.9717 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, ఆంధ్రా 4.3439 టీఎంసీలను వినియోగించుకుంది. దీని ప్రకారం ఒడిశా జూన్ నెలలో ఆంధ్రా కంటే 3.6278 టీఎంసీలు అధికంగా వినియోగించుకున్నట్టు నిర్ధారించారు. అలాగే 2023-2024 నీటి సంవత్సరంలో (2023 జూలై నుంచి 2024 జూన్ నెలఖరు నాటికి) మొత్తంగా ఆంధ్రా తన వాటాగా 65.9756 టీఎంసీలు (2022-2023 నీటి సంవత్సరంలో ఆంధ్రా అధికంగా వినియోగించుకున్న 13.7578 టీఎంసీలతో కలుపుకుని) వినియోగించుకుంది. అలాగే ఒడిశా తన వాటాగా 2023-2024 నీటి సంవత్సరంలో 65.5728 టీఎంసీలు వినియోగించుకున్నట్టు ఇరు రాష్ట్రాల అధికారులు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం 2023-2024 నీటి సంవత్సరాంతానికి ఒడిశా కంటే ఆంధ్రా 0.4028 టీఎంసీలు అధికంగా వినియోగించుకున్నట్టు తేలింది. ప్రస్తుతం బలిమెలలో 10.7200 టీఎంసీలు, జోలాపుట్‌లో 3.1226 టీఎంసీలు కలిసి మొత్తంగా 13.8426 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు లెక్కించారు. ఇందులో ఆంధ్రా వాటాగా 6.5185 టీఎంసీలుగా, ఒడిశా వాటాగా 7.3241 టీఎంసీలుగా పంపకాలు జరిపారు. ఆదేవిధంగా ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఈ నెలాఖరు నాటికి బలిమెలలో 6 టీఎంసీలు, జోలాపుట్‌లో 4 టీఎంసీలు నీటి నిల్వలు వచ్చి చేరనున్నట్టు అధికారులె అంచనా వేశారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల విద్యుత్ డిమాండ్, ఇరిగేషన్ అవసరాల నిమిత్తం నెలాఖరు వరకు ఆంధ్రాకు 1500 క్యూసెక్కుల నీటిని, ఒడిశా 3500 క్యూసెక్కుల నీటిని వినియోగించుకోవడానికి ఒప్పందం కుదిరింది. సమావేశంలో ఒడిశా తరుపున బలిమెల హైడ్రో పవర్ ప్రాజెక్టు జనరల్ మేనేజర్‌లు ఎస్. శివప్రసాదరావు (యూనిట్ హెడ్), కృపాసింధుబిస్వాల్(టెక్నికల్ వింగ్ హెడ్), డిప్యూటీ జరల్ మేనేజర్ దుర్గేస్ మెహర్, అసిస్టెంట్ మేనేజర్‌లు ఓంప్రకాష్‌నాయక్, రాకేష్ పాణిగ్రహి, పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ పితబాసిశెట్టి, చిత్రకొండ ఎర్త్‌డ్యాం డివిజన్ ఎస్ఈ రమాకాంతపాత్ర, ఏఈఈ తుషార్‌రంజన్‌కుంతే, ఏఈ గడాధర్ ప్రధాన్‌లు పాల్గొనగా, ఆంధ్రా తరుపున సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ ప్రభాకరరావు, ఏడీఈ వెంకటమధు, ఏఈఈ అనుదీప్ పాల్గొన్నారు.

డిప్యూటేషన్లు రద్దు

జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ



పాడేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు కారణాలతో చేసిన అన్ని డిప్యూటేషన్లు తక్షణమే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అనేక ప్రభుత్వ శాఖల్లోని అధికారులు, ఉద్యో గులు వివిధ కారణాలను చూపుతూ, ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి డిప్యూటేషన్లు వేయించుకున్నారు. ఈ తరుణంలో అన్ని డిపార్టుమెంట్లలో చేసిన డిప్యూటేషన్లను రద్దు చేసి, తమ స్థానాల్లో ఆ అధికారులు, ఉద్యోగులు పని చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఈ ఉత్తర్వులను సక్రమంగా అమలు చేయకుంటే సంబంధిత శాఖకు చెందిన ప్రధానాధికారిపై శాఖాపరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. జిల్లాలో వైద్యారోగ్య శాఖ,రెవెన్యూ శాఖల్లోనే అధికంగా డిప్యూటేషన్లున్నాయని అధికారులు భావిస్తున్నారు. జిల్లా కలెక్టర్ తాజా ఉత్తర్వులతో వారంతా యథాస్థానాల్లో విధులు నిర్వహించాల్సిందేనని అధికారులు అంటున్నారు.

కంప్యూటర్ సైన్స్‌కే డిమాండ్

పేరొందిన రెండు ప్రైవేటు కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీటు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షలు

- మరో రెండింటిలో రూ.3 లక్షలు-రూ.4 లక్షలు
- పొరుగు జిల్లా కళాశాలలో రూ.5 లక్షలు
- వీటికి ఫీజులు అదనం
- ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం
- ఏయూలోని రెండు కళాశాలల్లో 900 ఇంజనీరింగ్ సీట్లు
- 21 ప్రైవేటు కళాశాలల్లో 17,190



విశాఖపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌కు డిమాండ్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఐటీ సెక్టార్‌లో సంక్షోభం ఉన్నప్పటికీ మెజారిటీ విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ గ్రూపులోనే చేరేందుకు మొగ్గుచూపుతున్నారు. లక్షలు పోసైనా పేరున్న కళాశాలలో సీటు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నారు. నగర శివారుల్లోని రెండు కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాలో కంప్యూటర్ సైన్స్ సీటు కావాలంటే రూ.ఆరు లక్షల నుంచి ఏడు లక్షల వరకూ చెల్లించాలి. మరో రెండు కళాశాలలు మూడు లక్షల నుంచి నాలుగు లక్షలు చెబుతున్నాయి. పొరుగు జిల్లాలో మరో కళాశాలలో కంప్యూటర్ ...మిగతా 8వ పేజీలో

ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్ సీట్లు 18,090

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ పరిధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రెగ్యులర్, మహిళా కళాశాలల్లో కలిపి 900 సీట్లు, 21 ప్రైవేటు కళాశాలల్లో 17,190 సీట్లు...మొత్తం 23 కళాశాలల్లో 18,090 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా ఆంధ్ర విశ్వవిద్యాలయం రెగ్యులర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీలో 60 సీట్లకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది.

759 కిలోల గంజాయి స్వాధీనం

- ఐదుగురి అరెస్టు.. నిందితుల్లో బాలుడు
- పరారీలో ప్రధాన సూత్రధారి
- నిందితుల ఆస్తుల జప్తునకు చర్యలు
- అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్

-వార్త 8వ పేజీలో...



పట్టుబడిన గంజాయి, నిందితులతో అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, జీకే వీధి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.అప్పలనాయుడు, ఎస్ఐ కె.అప్పలసూరి

పార్వతీనగర్‌లో తహసీల్దార్ పర్యటన

- జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గ్రామస్థుల వివరాలు సేకరణ
- జెన్‌కో అధికారులు, సీలేరు సర్పంచ్ హాజరు
- కలెక్టర్‌కు నివేదిక ఇస్తా: తహసీల్దార్ ప్రసాద్



పార్వతీనగర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న గూడెంకొత్తవీధి తహసీల్దార్ ప్రసాద్

సీలేరు, జూలై 4: స్థానిక పార్వతీనగర్ గ్రామాన్ని జీకేవీధి తహసీల్దార్ ప్రసాద్ గురువారం సందర్శించారు. జీకేవీధి మండలం సీలేరులో 1,350 మెగావాట్లు సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు పార్వతీనగర్ వద్ద ఏపీ జెన్‌కో ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆ గ్రామాన్ని 15 రోజుల్లోగా ఖాళీ చేయాలంటూ స్థానిక జెన్‌కో అధికారులు గిరిజనులపై ఒత్తిడి చేశారు. దీంతో గ్రామస్థులు జీకేవీధి తహసీల్దార్, అల్లూరి జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం సీలేరు వచ్చిన కలెక్టర్ దినేశ్‌కుమార్ స్థానిక జెన్‌కో అధికారులతో పార్వతీనగర్ గ్రామాన్ని ఖాళీ ...మిగతా 8వ పేజీలో

వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు ఉద్యోగుల సంఘం వినతి

పాడేరురూరల్, జూలై 4: జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు ఆధ్వర్యంలో సంఘ నాయకులు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ..జిల్లాలో వైద్య ఆరోగ్య సిబ్బందికి నెలలో ఒకసారి ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి ఫీల్డ్ సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని, సబ్ సెంటర్లలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, ఆన్‌లైన్ వర్కు కోసం ఏర్పాటు చేసిన యాప్‌లను తగ్గించాలని, తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి వడ్డాది వాసి మృతి


దొండా సన్యాసిరావు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, జూలై 4: అనకాపల్లి నుంచి హైదరాబాదు రైలులో ప్రయాణిస్తున్న వడ్డాదికి చెందిన దొండా సన్యాసిరావు(62) ప్రమాదశాత్తూ జారిపడి మృతి చెందాడు. సన్యాసిరావు సోమవారం ఉదయం జన్మభూమి రైలులో అనకాపల్లి నుంచి హైదరాబాద్ వెళుతున్నారు. సామర్లకోట సమీపంలో రైలు పట్టాల పక్కన సన్యాసిరావు మృతదేహం పడి ఉండడాన్ని మంగళవారం ఉదయం రైల్వే పోలీసులు గుర్తించారు. ప్రమాదశాత్తూ రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావించారు. భర్త హైదరాబాద్ చేరుకోకపోవడంతో బుధవారం భార్య అమ్మోజీ.. సన్యాసిరావు సెల్‌కి ఫోన్ చేయగా, రైల్వే పోలీసులు ఈ విషయాన్ని తెలిపారు. దీంతో కుటుంబీకులు సామర్లకోట చేరుకుని, శాఖాపరమైన చర్యల అనంతరం గురువారం మధ్యాహ్నం మృతదేహాన్ని వడ్డాది తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. సన్యాసిరావు దుర్మరణం చెందడంపై భార్య అమ్మోజీ, కుమారులు హరీశ్, వెంకటేశ్, కుమార్తె సూర్యకళ కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆన్‌లైన్ చీటింగ్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూలై 4 : ఆన్‌లైన్ చీటింగ్‌పై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ జి. శంకరరావు గురువారం తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గవరపాలెం బుద్ద ప్రకాశరావునాయుడువీధికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొణతాల రాజేంద్రప్రసాద్‌కు ఈనెల ఒకటో తేదీన గుర్తు తెలియని అగంతకుడు జియో సిమ్ రీచార్జీ ఆగిపోయింది.. మళ్లీ అందుబాటులోకి రావాలంటే రూ.19 రీచార్జి చేసుకోవాలని చెప్పాడన్నారు. దీంతో ఫిర్యాది రాజేంద్రప్రసాద్ రూ.10లు రీచార్జి చేయగా.. ఆ పది రూపాయలతో రీచార్జి కాదని వెనక్కి పంపించి, రూ. 19 రీచార్జి చేయాలని నమ్మించడంతో నిజమే అనుకుని ఫిర్యాది రూ.19లు రీచార్జి చేశాడన్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న అగంతకుడు ఫిర్యాది రాజేంద్రప్రసాద్ అకౌంట్ నుంచి రూ.54,485లు విత్‌డ్రా చేశాడన్నారు. ఈ సంఘటనపై బుధవారం రాత్రి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, జూలై 4 : స్థానిక గవరపాలెం పరమేశ్వరిపార్కు జంక్షన్‌లో బుధవారం రాత్రి ఒక వ్యక్తి నుంచి 18 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. వై.గోపీగణేష్ అనే వ్యక్తి ప్రభుత్వ దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి తన పాన్‌షాపునకు వెళ్తుండగా అనుమానం వచ్చి పరమేశ్వరి పార్కు జంక్షన్ వద్ద తనిఖీ చేయగా 18 మద్యం బాటిళ్లు బయట పడడంతో వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

నాటు తుపాకీతో కుక్కను కాల్చి చంపిన కేసులో ఇద్దరి అరెస్టు

బుచ్చెయ్యపేట, జూలై 4: మండలంలోని కొండపాలెం గ్రామంలో నాటు తుపాకీతో కుక్కను కాల్చి చంపిన కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దాడ శ్రీనివాసరావుకి చెందిన నాటు కోళ్లను వీధి కుక్క చంపేసి తినేస్తోంది. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీనివాసరావు కేపీ అగ్రహారానికి చెందిన యాతగిరి నూకరాజుతో కుక్కను చంపడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో నూకరాజు తన దగ్గర ఉన్న నాటు తుపాకీతో కుక్కను కాల్చి చంపేశాడు. కొండపాలేనికి చెందిన వీఆర్ ఏ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నూకరాజు నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వీరిని చోడవరం కోర్టులో గురువారం హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

మనస్తాపంతో మహిళ మృతి


మృతురాలు డి.ఆశ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, జూలై 4 : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన మహిళ తాను బయట పనికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించడపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు సంబంధించి నక్కపల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన దొంగల ఆశ(27)కి అదే గ్రామానికి చెందిన నాగేంద్రబాబుతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆశ భర్త నాగేంద్రబాబు డ్యూటీకి వెళ్లడంతో అదే గ్రామంలో ఉంటున్న తన పుట్టింటికి వెళ్లింది. తాను ఏదైనా పనికి వెళతానని తల్లిని అడగ్గా ఆమె అంగీకరించలేదు. దీంతో మనస్తాపంతో ఆశ ఈనెల 2వ తేదీన సాయంత్రం చీమల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా.. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందిందని తెలిపారు. దీనిపై ఏఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కశింకోట, జూలై 4 : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ మండలం జోగంపేట గ్రామానికి చెందిన బట్టా నానాజీ (30) అనకాపల్లిలో ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పనులు ముగించుకొని నానాజీ, అదే గ్రామానికి చెందిన శివ వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో బయ్యవరం హెరిటేజ్ పాల ఉత్పత్తుల కేంద్రం వద్దకు వచ్చేసరికి వీరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న నానాజీ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. శివ అపస్మారక స్థితిలో పడిపోయాడు. దీంతో స్థానికులు సమాచారంలో 108 అంబులెన్స్‌లో మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి కారణమైన వాహనం పరారైంది. మృతునికి భార్య, ఒక ఏడాది కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కశింకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



మూతపడిన ప్రభుత్వ పాఠశాల

అనకాపల్లి టౌన్, జూలై 4: నీట్, నెట్ పేపర్ లీకేజిని నిరసిస్తూ విద్యార్థి సంఘాల నాయకులు గురువారం పట్టణంలో తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతంగా ముగిసింది. ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు బంద్ పాటించాయి. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ఓ విద్యార్థి సంఘాల నాయకులు పట్టణంలోని అన్ని విద్యాసంస్థలకు వెళ్లి నిరసనలు తెలిపారు. అలాగే నెహ్రూచౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మామిడి రమణ మాట్లాడుతూ నీట్, ఈజీసీ నెట్ పేపరు లీకేజిపై సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఐఐటీ ముంబయి నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు హరీష్, సింహాద్రి, తరుణ్, సందీప్, కుమార్, రాజేష్, సతీష్, విష్ణు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అచ్యుతాపురం రహదారి విస్తరణ షురూ

- యంత్రాల సాయంతో భవనాల కూల్చివేత
- గత ప్రభుత్వంలో పరిహారం తీసుకొని భవనాలు ఖాళీ చేయని యజమానులు
- భవన యజమానులు, వ్యాపారులకు నచ్చజెప్పిన ఎమ్మెల్యే


అచ్యుతాపురం-ఎలమంచిలి రహదారిలో కూల్చివేత పనుల్ని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సరోజిని

అచ్యుతాపురం, జూలై 4: ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చొరవతో అచ్యుతాపురం జంక్షన్‌కి మోక్షం కలిగింది. దీంతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో పరిహారం తీసుకొనికూడా కొందరు వైసీపీ నాయకులు భవనాలనుతొలగించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్డు విస్తరణకు యుద్ధప్రాతిపదికన యంత్రాల సాయంతో అధికారులు భవనాలను కూల్చివేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం జంక్షన్‌ని విస్తరించాలని గతంలో టీడీపీ ప్రభుత్వం యోచించింది. అచ్యుతాపురం-అనకాపల్లి, అచ్యుతాపురం-ఎలమంచిలి రోడ్లను 200 అడుగుల మేర విస్తరించాలని, అలాగే అచ్యుతాపురం జంక్షన్‌ని ఎటుచూసినా 400 అడుగుల మేర విస్తరించాలని భావించింది. ఈ మేరకు అధికారులు సర్వేలు కూడా చేసి మార్కింగ్‌లు కూడా ఇచ్చారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో పనులకు బ్రేక్ పడింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా రోడ్డు విస్తరణ పనులను కొనసాగించింది. అయితే కేవలం వంద అడుగుల మేర మాత్రమే విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు అచ్యుతాపురం జంక్షన్ పరిధిలోని భూ నిర్వాసితులకు అధికారులు పరిహారం కూడా పంపిణీ చేశారు. అయితే పరిహారం తీసుకున్న కొంతమంది తమ ఇళ్లను తామే యంత్రాలతో తొలగించి, పునర్నిర్మాణాలు చేసుకున్నారు. అయితే జంక్షన్‌లో పలుకుబడి కలిగిన నాయకులు మాత్రం పరిహారం తీసుకున్నా.. భవనాలను తొలగించలేదు. దీంతో వైసీపీ నాయకులు కూడా వారిపై ఒత్తిడి తీసుకురాలేదు. ఫలితంగా ప్రతి రోజూ అచ్యుతాపురం జంక్షన్‌లో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యేది. అయినా ఇటు అధికారులు గాని, అటు ప్రజాప్రతినిధులు గాని పట్టించుకొనేవారు కాదు. కూటమి ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే సుందరపు విజయకుమార్ అచ్యుతాపురం జంక్షన్‌పై దృష్టి సారించారు. తొలుత భవన యజమానులు, ఫుట్‌పాత్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. అయినా కొందరు నాయకులు పట్టించుకోలేదు. దీంతో విజయకుమార్ ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమీక్షించి పరిహారం తీసుకున్న వారి భవనాలను యంత్రాల సాయంతో కూల్చివేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు భారీ యంత్రాల సాయంతో జంక్షన్‌లోని బహుళ అంతస్థుల భవనాలను కూల్చివేయడం ప్రారంభించారు. భవనాలు కూల్చివేత పనులను తహసీల్దార్ సరోజిని పర్యవేక్షిస్తుండగా, సీఐ బుచ్చిరాజు భవనాలలు వద్ద బారీకేడ్లు ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ అచ్యుతాపురం జంక్షన్‌ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమన్నారు. సెజ్‌లో గల కర్మాగారాలకు వచ్చే విదేశీ ప్రతినిధులు, అతిథులు సెజ్ ముఖద్వారమైన అచ్యుతాపురం జంక్షన్‌ని చూసి మెచ్చుకొనేలా తీర్చిదిద్దుతానన్నారు. వివిధ కారణాల వల్ల ఇంతవరకు పరిహారం తీసుకోని నిర్వాసితుల పరిహారపు నగదును కోర్టులో జమ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు పెట్టడానికి ప్రయత్నించినా అచ్యుతాపురం జంక్షన్ విస్తరణ పనులు ఆపేది లేదని సుందరపు స్పష్టం చేశారు.

జల వనరుల బకాయిలు రూ.389.12 కోట్లు

- ఉత్తరాంధ్ర చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు ప్రభుత్వానికి నివేదిక


ఇరిగేషన్ సీఈ ఎస్.సుగుణాకరరావు

విశాఖపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల్లో గడచిన రెండు, మూడేళ్లలో జల వనరుల శాఖ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి రూ. 389.12 కోట్ల బకాయిలు ఉన్నట్టు నార్త్ కోస్టల్ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.121.12 కోట్ల బిల్లులు సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేశామన్నారు. మరో రూ.29.09 కోట్ల బిల్లులు సిద్ధం చేశామన్నారు. ఇంకా రూ.238.89 కోట్ల విలువైన పనులు పూర్తికాగా వాటి వివరాలు ఎంబుక్‌లో నమోదుచేయాల్సి ఉందన్నారు. ఉత్తరాంధ్రలో భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు 18 ఉన్నాయని, వీటిలో వంశధార ప్రాజెక్టు నిర్వహణ, అత్యవసర పనులు చేపట్టిందుకు రూ.25 కోట్లు, తారకరామా ప్రాజెక్టుకు రూ.20 కోట్లు, మూడు జిల్లాల్లో జపాన్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి రూ.35 కోట్లు బిల్లులు విడుదల చేయాల్సి ఉందన్నారు. ఇంకా మహేంద్రతనయా ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం రూ.35 కోట్లతో పనులు పూర్తిచేయగా, వాటిలో రూ.20.34 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. నదుల వరద కట్టల మరమ్మతుల కోసం రూ.51 కోట్లు వెచ్చించగా రూ.17 కోట్లు, తాటిపూడి ప్రాజెక్టు కింద రూ.17.6 కోట్ల పనులకు బిల్లులు అప్‌లోడ్ చేశామని వివరించారు. ఇటీవల జల వనరుల శాఖా మంత్రి సమీక్షలో బకాయిల వివరాలు ఇవ్వాలని ఆదేశించడంతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు చెల్లించాల్సిన బిల్లులపై నివేదిక రూపొందించి అందజేశామన్నారు.

ఇదిలావుండగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఉత్తరాంధ్రలో 6.18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రతిపాదించామన్నారు. తోటపల్లి ప్రాజెక్టు కింద పాత ఆయకట్టు 64 వేల ఎకరాలతోపాటు కొత్తగా తవ్విన కాలువల ద్వారా 84 వేల ఎకరాలకు నీరు విడుదల చేశామన్నారు. ఇంకా వంశధార, తాటిపూడి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీరు విడుదల చేశామన్నారు. కాగా, ప్రాజెక్టుల కింద కాలువల నిర్వహణ కోసం ఈ ఏడాది రూ.20 కోట్లు అవసరమని ప్రతిపాదించామన్నారు. ఇంకా నదులు, కాలువల గట్టు పటిష్టం చేయడం, గండ్లు పూడ్చడం, నిర్వహణకు నిధులు అవసరమని కోరినట్టు సీఈ సుగుణాకరరావు తెలిపారు. కాలువల పర్యవేక్షణకు 728 మంది లస్కర్లను తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తామన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

- గ్రామసభలో వెల్లడించిన సోషల్ ఆడిట్ అధికారులు

పాయకరావుపేట రూరల్, జూలై 4: మండలంలోని నామవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీల్లో భాగంగా గురువారం నిర్వహించిన గ్రామసభలో పలు అవకతవకలు వెలుగుచూశాయి. వీఆర్‌పీ దాసరి రామస్వామి ఉపాధి పనుల్లో బినామీ మస్తర్లతో భారీ అవకతవకలకు పాల్పడినట్టు సోషల్ ఆడిట్ అధికారులు వెల్లడించారు. ఉపాధి పనుల్లో వీఆర్‌పీ భారీగా అక్రమాలకు పాల్పడినట్టు గ్రామస్థులు గ్రామసభలో ఆరోపించారు. పనులకు రాని వారికి కూడా మస్తర్లు వేశారని, పనులు చేసిన వారికి కొంతమందికి పేమెంట్లు చెల్లించలేదని ఉపాధి కూలీలు ఆరోపించారు. గ్రామంలో సుమారు 87 పనులకు సంబంధించి చేపట్టిన రూ.54 లక్షల ఉపాధి పనుల్లో సుమారు రూ.21.7 లక్షలు అవకతవకలు జరిగినట్టు గుర్తించినట్టు సోషల్ ఆడిట్ అధికారులు తెలిపారు. వీటిలో హౌసింగ్ లబ్ధిదారులకు కాకుండా బయట వాళ్లకు రూ.3 లక్షల 47 వేల 296లు, బినామీ మస్తర్ల ద్వారా రూ.లక్షా 2 వేల 634లు, ఉపాధి పనుల కొలతల్లో సుమారు రూ.17 లక్షల 10 వేల 809లు అవతవకలు జరిగాయని వెల్లడించారు. అదే విధంగా పునాది లెవెల్లో ఉన్న ఇళ్లకు రూఫ్ లెవెల్లో బిల్లు చేసినట్టు, ఒకే ఇంట్లో రెండు జాబ్‌కార్డులతో పనులు చేపట్టినట్టు గుర్తించామన్నారు. ఉపాధి పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ అధికారులు చదివి వినిపిస్తుండగా గ్రామస్థులు అవకతవకలపై నిలదీయగా, ఎన్ఆర్‌జీఎస్ అధికారులు పిలుస్తున్నా వినిపించుకోకుండా వీఆర్‌పీ రామస్వామి గ్రామసభ నుంచి వెళ్లిపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఏపీవో హేమలత, టీఏ అచ్యుత్, డీఆర్‌పీ బి.పోలిరాజు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునాచార్యులు, టీడీపీ నాయకులు కురందాసు శివ, గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్ల లక్ష్మీనారాయణ, గొర్ల బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

మోటూరుపాలెంలో పలువురికి అస్వస్థత

అచ్యుతాపురం, జూలై 4: మండలంలోని దిబ్బపాలెం సచివాలయం-1 పరిధిలో గల మోటూరుపాలెంలో నిల్వ ఆహారం తిని తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యబృందం సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. మోటూరుపాలెంకి చెందిన ఒక కుటుంబం నిల్వ ఆహారం తినడంతో నలుగురు వాంతులు, విరేచనాలతో మంగళవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వీరు అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన వైద్య సిబ్బంది విషయాన్ని ఎంపీడీఓ సురేష్ కుమార్‌కు తెలిపారు. వీరంతా గ్రామాన్ని సందర్శించి, వ్యాధి సోకడానికి కారణాలను తెలుసుకున్నారు. అలాగే పక్కనున్న ఇంటిలో మరో ఐదుగురికి వాంతులు, విరేచనాలు కావడంతో వారిని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరిని గురువారం డిశ్చార్జి చేశారు. మరో ముగ్గురు అనకాపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, డీఐఓ డాక్టర్ చంద్రశేఖర్, ఎపిడమిక్ డాక్టర్ సతీష్, డాక్టర్ విజయకుమార్ మోటూరుపాలెం వెళ్లి పరిశీలన జరిపారు. అక్కడ ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ని ఏర్పాటుచేశారు.

టీడీపీ ఫ్లెక్సీ, ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసంపై ఆందోళన

- ఘటనకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని టీడీపీ శ్రేణుల డిమాండ్


జానకిరాంపురంలో గురువారం రాత్రి ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు, (ఇన్‌సెట్‌లో) పాక్షికంగా ధ్వంసమైన ఎన్టీఆర్ విగ్రహం

రోలుగుంట, జూలై 4: మండలంలోని జానకిరాంపురం గ్రామంలో టీడీపీ ఫ్లెక్సీ చించివేత, ఎన్టీఆర్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన ఘటనలో బాధ్యులను అరెస్టు చేయాలని టీడీపీ శ్రేణులు గురువారం రాత్రి ఆందోళన చేశారు. గ్రామంలో పింఛన్ల పంపిణీ సందర్భంగా టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, ఎంపీ సీఎం రమేశ్ ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని బుధవారం రాత్రి వైసీపీ మద్దతుదారులైన కొంత మంది వ్యక్తులు చించివేయడంతో పాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అయితే ఘటనకు కారకులైన వారిని ఇంకా అరెస్టు చేయకపోవడంతో గురువారం రాత్రి 11 గంటలకు టీడీపీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహం పక్కన టెంట్ వేసి ఆందోళన చేపట్టారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

- పరవాడ డీఎస్పీ సత్యనారాయణ


కొత్త చట్టాలపై బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ గఫూర్

ఎలమంచిలి, జూలై 4 : ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదైన 24 గంటల్లో సీఐతో పాటు ఎస్ఐలు సకాలంలో స్పందించి హత్య కేసును త్వరితగతిన ఛేదించారని ఆయన తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. కాగా జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. ఎలమంచిలి పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల వద్ద గంజాయి వినియోగించకుండా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ గఫూర్, పట్టణ ఎస్ఐ పాపినాయుడు పాల్గొన్నారు.

పెట్రోలియం, ఎనర్జీ సంస్థలో నిర్మాణాలు పూర్తి చేయాలి

- కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రిని కోరిన ఎంపీ సీఎం రమేశ్


కేంద్ర మంత్రి హర్దిప్ సింగ్‌పూరికి వినతి పత్రం అందిస్తున్న ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సబ్బవరంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, ఎనర్జీ సంస్థలోని రెండో దశ భవన నిర్మాణ పనులను ప్రారంభించి, పూర్తి చేయాలని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దిప్‌సింగ్‌పూరికి ఎంపీ సీఎం రమేశ్ కోరారు.

ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో మంత్రిని కలిసిన ఎంపీ రమేశ్ సబ్బవరంలో పెట్రోలియం, ఎనర్జీ సంస్థలో రెండో దశ భవన నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరంపై సమగ్ర నివేదికను అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

- డీఈవో వెంకటలక్ష్మమ్మ


ఏఎల్‌పురం హైస్కూల్‌లో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కృష్ణాదేవిపేట, జూలై 4: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు నిరంతరం కష్టపడాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. గురువారం గొలుగొండ మండలం ఏఎల్‌పురం హైస్కూల్‌ను ఆమె సందర్శించి ఉపాధ్యాయుల హాజరుపట్టిక, రికార్డులు తనిఖీలు చేశారు. అనంతరం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన మెనూ పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో అందాయా?, లేదా? అని ఆరా తీశారు. నోట్ పుస్తకాలను పరిశీలించి విద్యార్థులను ప్రశ్నలు వేసి సరైన సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరు లతో డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. ఆమె వెంట ఎంఈవో సత్యనారాయణ, స్థానిక ఇన్‌చార్జి హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు రామరాజు, టీవీ రమణ, లక్ష్మి, రామ్‌కుమార్, అచ్చుబాబు తదితరులు ఉన్నారు.

అల్లూరి చిత్రకళా మందిరం ప్రారంభం


స్పీకర్ అయ్యన్నకు అల్లూరి చిత్రపటాన్ని అందజేస్తున్న జాతీయ అల్లూరి యువజన సంఘం ప్రతినిధులు

కృష్ణాదేవిపేట, జూలై 4: అల్లూరి చరిత్రకు సంబంధించి అద్భుతమైన కళాఖండాలు విద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడతాయని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం అల్లూరి 127వ జయంతిని పురస్కరించుకుని కృష్ణాదేవిపేట సమాధులున్న పార్కులో జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఏర్పాటు చేసిన కళా మందిరాన్ని అయ్యన్న ప్రారంభించారు. ఈ కళా మందిరంలో రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవిప్రకాశ్, ఇతర కళాకారులు రూపొందించిన 18/24 వెడల్పు గల అల్లూరి చరిత్రకు సంబంధించిన 32 చిత్రపటాలు ఏర్పాటు చేశారు. ఇవి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

అల్లూరి చరిత్ర ఉద్యమాలకు స్ఫూర్తి

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ


కృష్ణాదేవిపేట గ్రంథాలయం వద్ద నిలువెత్తు అల్లూరి ఫైబర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

కృష్ణాదేవిపేట, జూలై 4: ఉద్యమాలకు స్ఫూర్తి విప్లవ వీరుడు అల్లూరి జీవిత చరిత్ర అని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి మైత్రి గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన నిలువెత్తు ఫైబర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి నడయాడిన ఈ ప్రాంతంలో అందరూ అల్లూరి అడుగుజాడలో నడవాలన్నారు. ఉద్యోగులు, పోలీసులు భాగస్వాములై తొమ్మిదేళ్ల క్రితం గ్రంథాలయం ఏర్పాటు చేసి అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కృష్ణాదేవిపేట హైస్కూల్‌లో టెన్త్, ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు కలిపి రూ.20 వేల నగదును విద్యార్థులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మణికుమారి, సర్పంచ్ సుజాత, నర్సీపట్నం డీఎస్పీ మోహన్, శ్రీకాకుళం సిటీ సీఐ సోమశేఖర్, ఏలూరు సీఐ అల్లు స్వామినాయుడు, విశాఖ సిటీ సీఐ పి.ఉదయ్‌కుమార్, నర్సీపట్నంరూరల్, కొయ్యూరు సీఐలు బి.హరి, ఎస్వీ రమణ, కృష్ణాదేవిపేట, నర్సీపట్నంరూరల్ ఎస్ఐలు ఉపేంద్ర, భీమరాజు, అల్లూరి మైత్రి గ్రంథాలయ సభ్యులు శర్మ, డేవిడ్‌రాజు, పోతల శ్రీరామ్మూర్తి , అప్పలకొండ, సత్యనారాయణ, వాసు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జూపార్కుకు కొత్త అతిథుల రాక


కామన్ మార్మో సెట్ (తెల్ల పక్షులు)

విశాఖపట్నం, జూలై 4: నగరంలోని జూపార్కుకు గురువారం సాయంత్రం కొత్త జంతువులు వచ్చినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొత్త జంతువు లను గుజరాత్‌లోని మోటీ ఖవీ జమ్నాగర్‌లోని రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు నుంచి తీసుకువచ్చామని చెప్పారు. వీటిని జంతు మార్పిడి పద్ధతిలో తీసుకువచ్చామన్నారు. వైద్యులు వాటిని పరీక్షించి, జూలోని క్వారంటైన్‌లో ఉంచారు. వీటిలో ఆకుపచ్చ రెక్కల మకావ్, స్కార్లెట్ మకావ్, మిలిటరీ మకావ్, మీడియం సల్ఫర్ కకాటూ, స్లెండర్ టెయిల్డ్ మీర్కట్, రెడ్ నెక్డ్ వల్లబీ, స్క్విరల్ మంకీ ఉన్నాయి. మొత్తం 29 కొత్త జంతువులను తీసుకువచ్చినట్టు తెలిపారు. వీటికి బదులు ఇక్కడి నుంచి హైనా, హాగ్ డీర్, పెయింటెడ్ స్టార్క్స్, గ్రె పెలికాన్, స్టార్ టార్టాయిస్, ఘరీయల్, జంగిల్ క్యాట్, ధోలే, తోడేలు, గౌర్ వంటి 49 రకాల పక్షులు, ఇతర జంతువులను అందించారు.

స్వాతంత్ర్య స్ఫూర్తి నింపిన ధీశాలి అల్లూరి

ఐటీడీఏ పీవో అభిషేక్


ఐటీడీఏ ఆవరణలో అల్లూరికి నివాళులు అర్పిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, అధికారులు

పాడేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విప్లవజ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు 127వ జయంతి వేడుకలు ఐటీడీఏ కార్యా లయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ఉన్న అల్లూరి సీతా రామరాజు, గాం మల్లుదొర, భగవాన్ బిర్సాముండా విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం లోని అల్లూరి సీతా రామరాజు చిత్రపటానికి పూలమా ల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ... సీతారామ రాజు వయస్సు చిన్నదైనా కీర్తి మాత్రం గొప్పదన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి స్వాతంత్ర్య సాధనకు నాంది పలికిందన్నారు. బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన పోరాటయోధుల గురించి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని, త్యాగమూర్తులను మనం ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్ ప్రభాకరావు, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, విద్యాశాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

గిరి విద్యార్థుల్ని అభినందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు


నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

పాడేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కలెక్టరేట్‌లో గురువారం నిర్వహిం చిన అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకల్లో గిరిజన విద్యార్థులు చేసిన దేశభక్తి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు విద్యారినులు దేశభక్తి గేయాలకు నృత్యాలు ప్రదర్శించగా, మరికొందరు స్కిట్స్ రూపంలో ప్రదర్శన ఇచ్చారు. అలాగే స్థానిక లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాల బాలురు చేసిన అల్లూరి సీతారామరాజు, మేజర్ గుడాల్ పాత్రల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అలాగే పాడేరు, హుకుంపే ట కస్తూర్బా విద్యాలయాల బాలికలు, కందమామిడి, గుత్తులపుట్టు, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంగ్లీష్ మీడియం పాఠశాల బాలబాలికలు పలు రకాల ప్రదర్శ నలిచ్చారు. అలాగే ప్రదర్శనలు, వ్యాసరచనల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్‌వో పద్మావతి, అరకులోయ ఎంపీ తను జారాణి, ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో అల్లూరి జయంతి


విగ్రహానికి పూలమాల వేస్తున్న అల్లూరి యూత్

డుంబ్రిగుడ, జూల్ 4 : మన్యం వీరుడు అల్లూరి సీత రామరాజు జయంతి వేడుకల ను మండల కేంద్రంతో పాటు కొర్రా తదితర పంచాయతీల పరిధిలో నిర్వహించారు. అల్లూరి యువజన సేవా సంఘం మండల అధ్యక్షుడు సూర్యప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో అల్లూ రి చేసిన పోరాటం ఎప్పటికీ ఆదర్శప్రాయం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎంస్వామి బొంజిబాబు, అనంద్. సర్పంచ్ అర్జున్, కార్యదర్శి శైలజ, అల్లూరి యూత్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో మొక్కల పెంపకం వేగవంతం

కలెక్టర్ దినేశ్‌కుమార్



పాడేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే మొక్కల పెంపకం ప్రక్రియను వేగవంతం చేయా లని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అధికారు లను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం సాయంత్రం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాదికి సంబంధించిన మొక్కలు నాటే ప్రక్రియలో భాగంగా నెల పదో తేదీ నాటికి అందుకు అవసరమైన గోతులు తీయాలని, 20 తేదీ నాటికి మొక్కలు నాటే పనులు పూర్తి చేయాలన్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో ఉన్న మొక్కలు, ఇంకా సమకూర్చాల్సిన మొక్కల వివరాలను పీవోలను అడిగి తెలుసుకు న్నారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని వై.రామవరం, మారేడుమిల్లి మండలా ల్లోని రైతులు రబ్బరు మొక్కలను అడుగుతున్నారని, వాటికి ప్రతిపాదనలు సమర్పిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శివయ్య, జిల్లా లోని వ్యవసాయ, ఉద్యానవన శాఖలకు చెందిన అధికారులు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీడీలు, ఏపీవోలు పాల్గొన్నారు.

అనధికార రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

» జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరిక

పాడేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతంలో అనధికార రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కు మార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైదాన ప్రాంతం నుంచి రక్త సేకరణ సంస్థలు ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించి రక్త సేకరణ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మాత్రమే రక్తదాన శిబిరాలు నిర్వహించి, రక్త సేకరణ చేయాలన్నారు. జిల్లాలో నెలకు ఎంత మేరకు రక్తం అవసరమవుతుందని రెడ్ క్రాస్ బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. నెలకు రెండు వందల యూనిట్ల వరకు రక్తం అవసరమవు తుందని, అందుకు వెయ్యి మంది దాతలను గుర్తించాలని రెడ్ క్రాస్ బృందం జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అలాగే పాడేరు, రంపచోడవరం, చింతూరులో జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేస్తామని, చింతూరులోని రెడ్ క్రాస్‌కు సంబంధించిన పాత భవనానికి మరమ్మతులు చేయిస్తామన్నారు. ఈసమావేశంలో జిల్లా వైద్యారో గ్యశాఖాధికారిడాక్టర్ సి.జమాల్‌భాషా, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గౌరీశంకర్, సూర్యారావు, జయలక్ష్మి, ఫార్మాసిస్ట్ సంజీవ్, జిల్లా కో ఆర్డినేటర్ లోహితాస్, బ్లడ్ బ్యాంకు ఎల్‌టీలు వెంకట్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నీట్, నెట్ అభ్యర్థులకు న్యాయం చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

చింతపల్లి, జూలై 4 : నీట్, నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేం ద్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని గిరిజన సంఘం మండల నాయకుడు సాగి న చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ పరీక్ష పేపర్లు లీక్ కావడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సంతబయలు నుంచి హనుమాన్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, పాత బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సంద ర్భంగా గిరిజన సంఘం మండల నాయకుడు మాట్లాడుతూ నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు.


అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సబ్ కలెక్టర్ ధాత్రీరెడ్డి తదితరులు


నక్కలపుట్టులో నివాళి అర్పిస్తున్న బొర్రా నాగరాజు తదితరులు


ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి

అల్లూరి ఆశయాలు యువతకు ఆదర్శం

» సబ్ కలెక్టర్ ధాత్రీరెడ్డి » మన్యంవీరుడికి పలు చోట్ల ఘన నివాళి » కళాశాలల్లో వివిధ అంశాలపై పోటీలు

పాడేరు రూరల్, జూలై 4 : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని గురు వారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ధాత్రీరెడ్డి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ అల్లూరి సీతారామరాజు ఆశయాలను యువ త స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని కిండంగి పంచాయతీ నక్కల పుట్టులో ఉన్న అల్లూరి విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొత్త పాడేరులో మాజీ సర్పంచ్ కురుసా పెద్దమ్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చ అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. బీజేపీ నాయకులు కె.జయప్ర కాష్ నారాయణ, పి.శ్రీధర్, డి.వసంతకుమారి, కె.సాయి, కె.పండు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి ఆధ్వర్యంలోఅల్లూరి జయంతి నిర్వహించారు. కళా శాల ప్రాంగణంలో ఉన్న అల్లూరి విగ్రహానికి ప్రిన్సి పాల్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అల్లూరి జయంతిని పురష్కరించుకొని కళాశాలలో నిర్వ హించిన వ్యాసరచన పోటీల్లో విజేతలలకు బహు మతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాడేరు పీటీడీ డిపోలో డీపీటీవో వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి ఆశయాలకు అనుగుణగాఆ ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాల న్నారు. ఈ సందర్భంగా డిపోలో ఉత్తమ ప్రతిభను కనపర్చినవివిధ భాగాలకు చెందిన ఆర్టీసీ ఉద్యోగు లు కేవీఎస్ఎన్ రాజు, కె.సంజీవరాజు, సీహెచ్ నూకరాజు, ఎం.రాజు, కె.సైతాన్‌లకు ప్రశంస పత్రా లను అందించారు. ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు ప్రభు ఆధ్వర్యంలో జయంతి వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు పాపారావు, మహేష్, రాజ్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అల్లూరి జయంతి వేడు కలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి జయంతి సందర్భంగా ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న అల్లూరి విగ్రహానికి సీపీఐ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా సమితి సభ్యులు జల్లి రాజుబాబు, మండల సహాయ కార్యదర్శి అమర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్య దర్శి ముువ్వల లక్ష్మణ్, శివశంకర్ పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళులు


అల్లూరికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

జి.మాడుగుల, జూలై 4 : గిరిజనులకు గొప్ప చైతన్యం కలిగించిన అల్లూరి సీతారామరాజు అడుగు జాడల్లో నేటి యువత నడవాలని స్థానిక టీడీపీ నేతలు కల్యాణం, నాగబ్బాయి మత్స్యరాజు అన్నారు. అల్లూరి 127వ జయంతిని పురస్కరించుకోని సాడెకు కాలనీలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు ఆర్.కొండబాబు, ఎస్.సత్యనారా యణ, బుజ్జిబాబు, సంజీవరావు, చంటిబాబు, శ్రీను తది తరులు పాల్గొన్నారు.

పెదబయలులో..

పెదబయలు : మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు 127వ జయంతిని మండలంలోని ఎంపీడీవో కార్యాయం, గురుకుల పాఠశాలతో పాటు పలుచోట్ల అల్లూరి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఎంపీ విగ్గిస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో అల్లూరి చూపిన ధైర్యసాహసాలను వివరించారు. ఆయన గొప్ప స్ఫూర్తిమంతుడని పేర్కొన్నారు. ఎంపీడీవో ఎల్.విగ్గిస్, గురుకుల ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ, ఏవో పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ఆధ్వర్యంలో అల్లూరి జయంతి


నివాళులు అర్పిస్తున్న జెన్‌కో అధికారులు, ప్రజా ప్రతినిధులు

సీలేరు, జూలై 4 : జీకేవీధి మండలం సీలేరులో గురువారం మన్యంవీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

స్థానిక పోస్టాఫీస్ వద్ద గల అల్లూరి విగ్రహానికి సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో సూపరిం టెండెంట్ ఇంజనీ ర్ కేకేవీ ప్రశాం త్‌కుమార్ తది తరులు పూలమాలలను వేసి నివాళులు అర్పించారు. జెన్‌కో ఈఈలు ప్రభా కరరావు, రాజేంద్రప్రసాద్, ఏవో ఈవీవీ సత్య నారాయణ, ఏఈ లు సురేష్‌కుమార్, అను దీప్, ఎస్‌ఐ రామకృష్ణ, సర్పంచ్ దుర్గో, ఎంపీటీసీ పి.సాంబమూర్తి, మాజీ ఎంపీటీసీ లూసీ, కార్మిక యూనియన్ నాయకులు వై.సత్తిబాబు, వై.దార్రాజు, బి.లక్ష్మణ్, టీడీపీ నాయకులు బొర్రా కృష్ణ, నక్కా తిరుమల రావు, చిటికెల రాము తదితరులు పాల్గొ న్నారు.ధారాలమ్మ ఆలయం వద్ద గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ధారకొండ గ్రామ స్తులు పూలమాలను వేసి ఘనంగా నివా ళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నడి గట్ల నాగభూషణం అర్చకులు నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. సీలేరు జూనియర్ కాలేజీలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అరకులో అల్లూరికి ఘన నివాళి


ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలో అల్లూరికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాలు, విద్యార్థులు

అరకులోయ, జూలై 4 : అరకులోయలో అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్, జూనియర్ కళాశాలలో విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డీవీఎస్ రావు, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నా రు. పద్మాపురం గార్డెన్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి గార్డెన్ మెనేజర్ లకే బొంచిబాబు, సిబ్బంది అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అల్లూరి చిత్రపటానికి ప్రిన్సి పాల్ భరత్‌కుమార్ నాయక్, మహిళా కళా శాల ప్రిన్సిపాల్ రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు ప్రిన్సిపాల్స్ భరత్‌కుమార్ నాయక్, రామకృష్ణ బహుమతులను ప్రదానం చేశారు.

కలెక్టర్ దృష్టికి పాడేరు నియోజకవర్గ సమస్యలు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జూలై 4 : అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌ను పాడేరు అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందించి శాలువా కప్పి అభినంద నలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు వివరించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవా లంటూ కోరారు. ఆమె వెంట టీడీపీ కోడా వెంకట సురేష్‌కుమార్, డప్పోడి వెంకటర మణ, బుక్క జగదీష్, లకే పార్వతమ్మ, పాంగి పాండురంగస్వామి, తామర్ల సత్యనారాయణ, బాకూరు వెంకటరమణ, శశిభూషణ్ తదిత రులు ఉన్నారు.

పోరాట స్ఫూర్తికి మారు పేరు అల్లూరి

» ఎంపీపీ రమేశ్‌బాబు, ఎంపీడీవో సీతయ్య » విప్లవ వీరుడికి పలువురు ఘన నివాళి


అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో, సర్పంచ్ తదితరులు


నడింపాలెంలో అల్లూరి, గంటం దొర, మల్లు దొరలకు నివాళులు అర్పిస్తున్న గ్రామస్థులు

కొయ్యూరు, జూలై 4 : జాతీయోద్యమ జ్వాలను రగి లించిన నిప్పు కణిక గిరిజనుల ఆరాధ్య దైవం అల్లూరి సీతా రామరాజు అని ఎంపీడీవో లాలంసీతయ్య, ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు, మాజీ ఎంపీపీ జి.సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తదితర నేతలు పేర్కొన్నారు. అల్లూరి 126వ జయంతి వేడుకలను గురువారం మంప, రాజేంద్రపాలెంఅల్లూరి స్మారక మంది రాల ఆవరణలోనూ, కొయ్యూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంప, రాజేంద్ర పాలెం అల్లూరి స్మారక ప్రదేశంలో ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించా రు. ఎంపీపీ బడుగు రమేష్ బాబు ఆధ్వర్యంలో రాజేంద్ర పాలెంలో అల్లూరికి నివాళి అర్పించారు. అల్లూరి యూత్, సీపీఐ బీజేపీ, తెలుగుదేశం పార్టీల నేతలు గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆధ్వర్యంలో రాజేంద్రపా లెం మండల పరిషత్ కార్యాలయంకు ఎదురుగా ఉన్న విగ్రహంతో పాటు బూదరాళ్ళ కూడలి, కొయ్యూరు, మంపలో ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

శరభన్నపాలెం సమీప నడింపాలెంలో అల్లూరి అనుచరులుగా ముద్రపడిన గంటం దొర, మల్లుదొర అల్లూరి విగ్రహాలకు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గంటందొర కుటుంబీకులతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మంపలో అల్లూరి ధ్యాన విగ్రహం వద్దమాజీ ఎంపీటీసీ శివరామరాజు, బీజేపీ నేత అన్నపూర్ణ తదిత రులు నివాళి అర్పించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లా డుతూ అల్లూరిని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు కార్యా లయడీటీ సత్యనారాయణ, వీఆర్‌వోలు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, రాజేంద్రపాలెం, కొయ్యూరు, మంప సర్పంచ్‌లు సింహాద్రి, బాలరాజు, రామన్నపడాల్, టీడీపీ నేతలు బఖీర్‌ఖాన్, అనిశెట్టి చిరంజీవి, మాకాడ బూర్జు లయ్య, బీజేపీ నేతలు ఎ.రాజు, సీపీఐ నేతలు ఐ.దేముడు అధిక సంఖ్యలో గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

మన్యం వీరుడిని స్మరించుకున్న చింతపల్లి


నివాళి అర్పిస్తున్న అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్, క్షత్రియ సంఘం నాయకులు

చింతపల్లి, జూలై 4 : స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూ రి సీతారామరాజు పోరాట పటిమ చిరస్మరణీయమని స్థానిక అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ అన్నారు. గురు వారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద క్షత్రియ సేవా సంఘం నాయకులతో కలిసి అల్లూరి జయంతిని పుస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పల స్వామి, బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం జేఏ కొండ లరావు సీతారామరాజు చిత్రపటానికి పూలమాలేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ సీతారామారాజు ఉద్యమాన్ని భావితరాల ప్రజలు తెలుసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవా సంఘం దక్షిత భారతదేశం డైరెక్టర్ ఆర్ఎస్ లక్ష్మీనరసింహరాజు, నర్సీపట్నం డైరెక్టర్లు బుద్ధరాజు, చక్రపాణిరాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రమేశ్, జీసీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు బీఏ రాజు, శాస్త్రవేత్తలు బయ్యపురెడ్డి, బాల హుసేన్ రెడ్డి పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు

జి.మాడుగుల, జూలై 4 : మన్యంలో ఖరీఫ్ వరి నాట్లు పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది మన్యంలో విస్తా రంగా వర్షాలు కురువడంతో వరి నారు ముందుగా వేశారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరడంతో దుక్కులు, దమ్ములు చేపట్టి నాట్లుకు సిద్ధం చేశారు. ఈ ఏడాది జూలై మొదటి వారంలోనే పలు ప్రాంతాల్లో వరి నాట్లు వేస్తున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఈ ఏడాది అశాజనకంగా ఉంటుందని అంటున్నారు.

కంప్యూటర్ సైన్స్‌కే డిమాండ్

... 5వ పేజీ తరువాయి

సైన్స్ సీటు రూ.ఐదు లక్షలు పలుకుతుంది.

రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ నిర్వహించిన ఈఏ పీసెట్ (ఎంసెట్)లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ప్రారంభమైంది. టాపర్లు పలువురు జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్‌లో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించి ఉంటారు. అటువంటి వారంతా ఐఐటీ/ఎన్ఐటీ/తత్సమాన జాతీయ వి ద్యాసంస్థల్లో చేరతారు. అక్కడ సీట్లు రాని విద్యార్థు లు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల, నగర శివారు ల్లోని నాలుగు, పొరుగు జిల్లాలోని ఒక ప్రైవేటు క ళాశాలలో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు. ఇ క్కడ కూడా కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరేందుకు ఇష్టపడుతున్నారు. ఏయూలో కంప్యూటర్ సైన్స్, ఐ టీల్లో సీటు రాకపోతే ప్రముఖ ప్రైవేటు కళాశాల లో అదే కోర్సులో చేరడానికి మొగ్గు చూపుతున్నా రు. అయితే మెరుగైన ర్యాంకులు రాని విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం యత్నిస్తున్నారు. ఆర్థికంగా స్థోమత కలిగిన వారు లక్షల రూపాయలు పోసి సీట్లు కొంటున్నా రు. నగర శివారుల్లోని రెండు కళాశాలల్లో మేనేజ్ మెంట్ కోటాలో కంప్యూటర్ సైన్స్ సీటు కావాలంటే తొలుత ఆరు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయ లు కట్టాలి. ఆ తరువాత ఏటా రూ.2.25 లక్షల చొప్పున నాలుగేళ్లలో మరో రూ.తొమ్మిది లక్షలు చె ల్లించాల్సి ఉంటుంది. అంటే మొత్తం రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షలు అవుతుంది. దానికి పుస్తకా లు, రవాణా, ఇతరత్రా ఖర్చులు అదనం. మరో రెం డు కళాశాలల్లో డొనేషన్లు, నాలుగేళ్ల ఫీజు కలిపి రూ.10 లక్షల నుంచి రూ.11 లక్షలు అవుతుందని గాజువాకకు చెందిన దాసరి సురేంద్ర అనే పేరెంట్ వెల్లడించారు. పొరుగు జిల్లాలో ప్రముఖ కళాశాల లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీటుకు రెండు లక్ష లు డొనేషన్ చెల్లించామని తగరపువలసకు చెంది న వెంకట్ అనే పేరెంట్ వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే తీసుకుని సీట్లు కే టాయించాలన్న నిబంధనను ఏ ఒక్క కళాశాల యాజమాన్యం పాటించడం లేదని పలువురు తల్లి దండ్రులు చెబుతున్నారు. ఇంజనీరింగ్‌లో కంప్యూ టర్ సైన్స్ కాకుండా మిగిలిన బ్రాంచీలకు పెద్దగా డిమాండ్ ఉండడం లేదు. ఏయూలో మాత్రం కంప్యూటర్ సైన్స్ తరువాత మిగిలిన బ్రాంచీల్లో చే రేందుకు విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు ఇస్తున్నారు. కం ప్యూటర్ సైన్స్ కాకుండా ఇతర బ్రాంచీల విద్యార్థు లు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఐటీ రంగంలో ఉద్యో గం పొందాలంటే కంప్యూటర్ సంబంధిత కోర్సులు చేయాల్సిందేనని ఐటీ కన్సల్టెంట్ నిపుణుడు నర సింహరావు వ్యాఖ్యానించారు. ఐటీ రంగంలోనే భా రీ ఉద్యోగాలు ఉన్నందున ఎక్కువ మంది కంప్యూ టర్ సైన్స్ కోర్సుల్లో చేరుతున్నారని, ఈ ట్రెండ్ రెం దున్నర దశాబ్దాల నుంచి కొనసాగుతుందన్నారు. గడచిన రెండు, మూడేళ్ల నుంచి కంప్యూటర్ సై న్స్‌తో పాటు అందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటాసైన్స్ కోర్సులు వచ్చాయన్నారు.

ఎక్కువ ఉద్యోగావకాశాల వల్లే..

- ఆచార్య వెంకటరావు,
కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి,
ఏయూ ఇంజనీరింగ్ కళాశాల

ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా కంప్యూ టర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. పేరున్న కళా శాలల్లో సీటు కోసం లక్షలు వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం ఐటీలో కొంత స్లంప్ ఉన్నా..ఇప్పటికీ ఈ రంగంలోనే ఎక్కువ ఉద్యోగాలు దొరుతుతున్నాయి. తొలుత తక్కువ ప్యాకేజీతో చేరినా తరువాత అను భవం, కొత్త కోర్సులు నేర్చుకుంటే మంచి భవిష్య త్తు ఉంటోంది. ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు కొ త్త అంశాలను నేర్చుకునే దిశగా ప్రయత్నించి పో టీతత్వం అలవర్చుకుంటే బ్రాంచి ఏదైనా ఫర్వాలేదు.

759 కిలోల గంజాయి స్వాధీనం

చింతపల్లి, జూన్ 4 : ఒడిశా నుంచి తమిళనాడు ప్రాంతానికి తరలిస్తున్న 759 కిలోల గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నట్టు చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చే శామని, అందులో ఒక బాలుడు ఉన్నాడన్నారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు. గురువారం ఉదయం స్థానిక డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరా లను అదనపు ఎస్పీ వెల్లడించారు.

ఒడిశా రాష్ట్రం చిత్రకొండ బోడపొదూరు తాలూకా బరడబంద గ్రామానికి చెందిన లింగు ఖిలా అలియాస్ బాబూరావు 759 కిలోల గంజాయిని జీకేవీధి మీదుగా మైదాన ప్రాంతంలో గల అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపైకి చేర్చి, అక్కడ నుంచి తమిళనాడు తరలించేందుకు సిద్ధమయ్యాడు. గంజాయి రవాణా కోసం రూ.లక్ష చొప్పున చెల్లిస్తానంటూ జీకే వీధి పంచాయతీకి చెందిన కొర్ర లైకోన్ అలియాస్ లక్ష్మణ్, ఊబలు గ్రామానికి చెం దిన కిల్లో శంకరరావు వాహనాలను అద్దెకు తీసుకున్నా డు. వాహనాలకు పైలట్‌గా జీకే వీధి మండలం రింతా డ పంచాయతీ కుమ్మరవీధికి చెందిన పాంగి గోవర్ధన్ అ లియాస్ కేశవ్‌ను ఏర్పరచుకున్నాడు. గంజాయి లోడింగ్, రవాణాలో సాయంగా ఉండేందుకు చింతపల్లి మండలం కడశిల్ప గ్రామా నికి చెందిన ఓ బాలుడు (17), ధారకొండ పంచాయతీ చినగంగవరం గ్రామానికి చెందిన వండలం బాలుబద్ద ర్‌లను మాట్లాడుకున్నాడు. బుధవారం రాత్రి రెండు వాహనాల్లో గంజాయి తరలిస్తుండగా పక్కా సమాచా రంతో జీకే వీధి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.అప్పలనాయుడు, ఎస్‌ఐ కె.అప్పలసూరి వాహనాల తనిఖీ చేపట్టారు. గంజాయి తరలిస్తున్న రెండు వాహనాలు అక్కడకు చేరుకోగానే చాకచక్యంగా పట్టుకున్నారు.

ఈ సందర్భంగా బాలుబద్ధర్, పాంగి గోవర్ధన్, కొర్ర లైకోన్, కిల్లో శంకరరావు, బాలుడిని అదుపులోకి తీసుకు న్నారు. నిందితుల నుంచి వాహనాలు, 759 కిలోల గంజాయి, ఐదు సెల్ ఫోన్లు, 16,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు సూత్రధారి అయిన లింగు ఖిలా పరారీలో ఉన్నాడని అదనపు ఎస్పీ తె లిపారు. అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తు న్నామన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం గంజాయితో పట్టుబడిన నిందితుల ఆస్తులు జప్తు చేసేందుకు చర్య లు తీసుకుంటామని చెప్పారు.

గంజాయి కేసుల్లో నిందితులతో సంబంధాలు కలిగిన వ్యక్తుల ఆస్తులను కూడా జప్తు చేస్తామన్నారు. పట్టుబ డిన గంజాయి విలువ రూ.37 లక్షలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పల నాయుడు, ఎస్‌ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

పార్వతీనగర్‌లో తహసీల్దార్ పర్యటన

... 5వ పేజీ తరువాయి

చేయాలంటూ నోటీసులు జారీ చేయడంపై చర్చిం చారు. పార్వతీనగర్ ప్రాంతం జెన్‌కోకు చెందినదని జెన్‌కో అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అయితే పదేళ్ల క్రితం తాము గ్రామం ఏర్పాటు చేసుకున్న సమ యంలో అటవీ శాఖ అధికారులు మాత్రమే అభ్యంతరం వ్యక్తం చేశారని, జెన్‌కో అధికారులు ఏనాడు రాలేదని పార్వతీనగర్ గిరిజనులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తాము అప్పటి తహసీల్దార్, ప్రజాప్రతినిధుల సహకా రంతో గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నట్టు వివరించారు. దీంతో కలెక్టర్ పార్వతీనగర్ గ్రామస్థులకు ముందుగా వేరే చోట నివాసాలను ఏర్పాటు చేసిన తరువాతే ఆ గ్రామాన్ని ఖాళీ చేయించా లని జెన్‌కో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ గ్రామం స్థితిగతులపై నివేదికను అందజేయాలని జీకే వీధి తహసీలార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తహసీల్దార్, సిబ్బందితో వెళ్లి గ్రామాన్ని పరిశీ లించారు. గ్రామస్థులతో మాట్లాడి, వివరాలు సేకరించారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తా మని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, వీర్వో స్వరూప్, సీలేరు సర్పంచ్ దుర్గోలు పాల్గొన్నారు.